సాక్షి పార్వతీపురం మన్యం

శుక్రవారం । 10 । మే । 2024



సూపర్ సాలూరు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో సాలూరు మున్సిపాలిటీలో ముమ్మరంగా చేపట్టిన అభివృద్ధి పనులతో పట్టణంలో సమస్యలన్నీ దూరం కావడంతో సుందరంగా దర్శనమిస్తోంది. - 8లో



అక్షరాలే ఆరాధ్య దైవాలు

మాతృభాషకు గుర్తింపునిచ్చే అక్షర రూపాలనే దేవతలుగా ఆరాధించే అరుదైన ఆచారం ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ఆదివాసీ గిరిజనుల్లో ప్రత్యేకంగా కనిపిస్తుంది. - 8లో

తడిసిముద్దయిన వీరఘట్టం

వీరఘట్టం: వీరఘట్టంలో గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి పట్టణమంతా తడిసి ముద్దయింది. కొన్ని నెలలుగా జాడలేని వర్షం అకస్మాత్తుగా కురువడంతో రహదారులన్నీ జలమ యయ్యాయి. ఎండ తీవ్రత, ఉక్కపోతతో అల్లాడిన జనం ఈ వర్షంతో ఉపశమనం పొందారు. మండల కేంద్రంలో గురువారం కురిసిన భారీ వర్షం కారణంగా హైస్కూల్ గ్రౌండ్‌లోకి వర్షపునీరు చేరి చెరువును తలపించింది.

న్యూస్‌రీల్

ఆర్‌ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని భద్రగిరి ప్రభుత్వ ఆర్‌ఐటీఐలో 20224–25 విద్యా సంవత్సరానికి గాను మొదటి విడత ప్రవేశాల నిమిత్తం విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ఏ ట్రేడుల్లో చేరదలుచుకున్నారో ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్ సైట్ ద్వారా జూన్ 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు ఫారం ప్రింట్ తీసుకుని, సమీపంలో గల ప్రభుత్వ ఆర్‌ఐటీఐ వద్దకు వెళ్లి వెరిఫికేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. మొదటి విడతగా సాలూరులోని ప్రభుత్వ ఆర్‌ఐటీఐలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచిచారు. పదో తరగతి పాస్/ఫెయిల్ అయిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గర్భిణుల ఆరోగ్యంపై దృష్టి


- డీఎంహెచ్ఓ విజయపార్వతి




వీరఘట్టం పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ విజయపార్వతి

వీరఘట్టం: వైద్యాధికారులు గర్భిణుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని పార్వతీపురం మన్యం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి విజయపార్వతి సూచించారు. ఈ మేరకు గురువారం ఆమె స్థానిక పీహెచ్‌సీని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీఎంఎస్ఎంఏ పథకం ద్వారా గర్భిణులకు అందిస్తున్న ఆరోగ్య సేవలపై ఆరా తీశారు. గర్భిణులకు నిర్వహిస్తున్న ఆరోగ్య తనిఖీల వివరాలను ఎంసీపీ కార్డులో నమోదు చేయాలని సూచించారు. అలాగే ప్రభుత్వాస్పత్రుల్లో సుఖ ప్రసవాలపై గర్భిణులకు అవగాహన కల్పించాలని చెప్పారు. హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు.

చెప్పారంటే.. చేస్తారంతే..!



గడిచిన 2019 సార్వత్రిక ఎన్నికల ముందు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు ఏవైతే హామీలిచ్చారో వాటిలో 99 శాతం నెరవేర్చారు. జగన్ మోహన్ రెడ్డి ఏదైతే చెబుతారో.. అది చేస్తారని..చేయగలిగిందే చెబుతారన్న నమ్మకం ప్రజల్లో బలంగా ఉంది. ప్రతి పేదవాడికీ మేలు చేయాలన్నదే తమ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంకల్పమని, ఆయన బాటలోనే తామంతా నడుస్తూ నియోజకవర్గాలను అభివృద్ధి బాటలో నడిపిస్తున్నామని వైఎస్సార్‌సీపీ పార్వతీపురం అసెంబ్లీ అభ్యర్థి అలజంగి జోగారావు చెబుతున్నారు. సార్వత్రిక ఎన్నికల వేళ మరోసారి పోటీలో ఉన్న ఆయన ప్రచారంలో బిజీగా ఉన్నప్పటికీ సాక్షితో తన మనోభావాలను పంచుకున్నారు. ఆయన చెప్పిన వివరాలు ఆయన మాటల్లోనే.. –సాక్షి, పార్వతీపురం మన్యం



వైఎస్సార్‌సీపీ ప్రభంజనం ఆపలేరు

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఇవ్వడమే గానీ, తీసుకోవడం రాదు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరిట ప్రజల భూములను ప్రభుత్వం లాక్కుంటుందనేది కేవలం దుష్ప్రచారం. ప్రతి పేదవాడికీ మేలు చేయాలన్నదే మా ప్రభుత్వం సంకల్పం. నాడు వైఎస్సార్ గానీ, నేడు జగన్‌మోహన్‌రెడ్డి గానీ పేదల పక్షానే పాలన సాగించారు. మా ప్రభుత్వం సాగించిన 59 నెలల పాలనలో ఒక్క పార్వతీపురం నియోజకవర్గంలోనే 50 వేల ఎకరాలకు సంబంధించి పోడు పట్టాలిచ్చాం. తెలుగుదేశం పార్టీ జవసత్వాలు కోల్పోయింది. ఒంటరిగా మమ్మల్ని ఎదుర్కోలేక కూటమి కట్టారు. ఎంతమంది కలిసినా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనాన్ని ఆపలేరు.

జగన్ అంటేనే విశ్వాసం

2019 ఎన్నికలకు ముందు జగన్‌మోహన్ రెడ్డి సుదీర్ఘ పాదయాత్ర చేపట్టి, బలమైన మేనిఫెస్టో రూపొందించారు. మేనిఫెస్టోలో ప్రకటించిన 99 శాతం హామీలను నెరవేర్చారు. బహుశా ఏ ప్రభుత్వమూ ఈ విధంగా చేయలేదేమో. కులమతాలు, పార్టీలకతీతంగా అన్ని వర్గాలకూ మేలు కలిగింది. పేదలకు మరింత లబ్ధి కలిగించేలా నవరత్నాల ప్లస్ మేనిఫెస్టో ఉంది.

చంద్రబాబు హామీలన్నీ అమలైతే రాష్ట్రం ఏమైపోతుందో?


లంచాలు, మధ్యవర్తిత్వానికి తావివ్వకూడదని మేము నేరుగా పేదలకు నగదు బదిలీ చేస్తేనే రాష్ట్రం శ్రీలంక, వెనిజులా అయిపోతుందని ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్నాయి. ఇప్పుడు చంద్రబాబు చెబుతున్న సూపర్‌సిక్స్ హామీల్లో ఏ ఒక్కటైనా నమ్మదగినదిగా ఉందా? రైతుకు రూ.20 వేలు భరోసా సాయం అంటున్నాడు. ఈ లెక్కన రాష్ట్రంలోని రైతులకు సుమారు రూ.12 వేల కోట్లు అవుతుంది. ఒక్క రైతు భరోసానే ఇచ్చి మిగిలిన ఇన్‌పుట్ సబ్సిడీ, విత్తనాలు, ఎరువుల రాయితీ ఎత్తేస్తాడా? తల్లికి వందనం కింద సుమారు 50 లక్షల మందికి రూ.20 వేల కోట్ల వరకూ చెల్లించాలి. ఉచిత బస్సు ప్రయాణం కింద నెలకు రూ.450 కోట్లు అవుతుంది. గ్యాస్ సిలిండర్లకు రూ.12 వేల కోట్లు వెచ్చించాలి. మనకు అంత ఆదాయం ఎక్కడి నుంచి వస్తుంది. అందులో సగం మొత్తం మా ప్రభుత్వం ఖర్చు చేస్తేనే గగ్గోలు పెడుతున్న చంద్రబాబు..ఆ పథకాలన్నీ అమలు చేయగలడా? ఇక అభివృద్ధి ఏం చేస్తాడు? ఉద్యోగులకు జీతాలు ఇస్తాడా? అవన్నీ మోసపూరిత హామీలు. ఒక్క పథకాన్నీ అమలు చేయలేడు.

ల్యాండ్ టైటిలింగ్ తెచ్చింది బీజేపీనే

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ విషయంలో ఏదో జరిగిపోతున్నట్లు దుష్ప్రచారం చేస్తున్నారు. అసలు ఆ చట్టాన్ని తెచ్చిందే బీజేపీ, దాని మిత్రపక్షాలు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దగ్గర ఈ చట్టం కోసం చంద్రబాబు గానీ, పవన్ కల్యాణ్ గానీ ఎందుకు మాట్లాడడం లేదు. మేము గ్రామాల్లోకి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నప్పుడు వారి నుంచి సానుకూల స్పందన వస్తోంది. మీ ప్రభుత్వం ద్వారా భూములను, ఇతర పథకాలను పొందామే గానీ..ఎప్పుడూ మా వద్ద తీసుకోలేదని చెబుతున్నారు. జగన్ వచ్చాకే సంతృప్తికరంగా ఉన్నామని అంటున్నారు. మా ప్రభుత్వంలో జరిగిన మంచి పనులను అడ్డుకుంటున్నారు. చివరికి ప్రతి నెలా ఇంటికి తీసుకువెళ్లి అందించే పింఛన్లనూ దూరం చేసి, అవ్వాతాతలపై కక్షగట్టారు. ఇదెక్కడి దుష్ట సంస్కారం.

గతంలో లేనివిధంగా నియోజకవర్గం అభివృద్ధి

పార్వతీపురం నియోజకవర్గంలో మునుపెన్నడూ లేనివిధంగా అభివృద్ధి చేసి చూపించాం. సంక్షేమ పథకాలకే డీబీటీ, నాన్‌డీబీటీ కింద దాదాపు రూ.1,540 కోట్లు అందించాం. సుమారు రూ.650 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టాం. ఇందులో వంతెనల నిర్మాణం, ప్రధాన రహదారులున్నాయి. 13,080 మంది పేదలకు పక్కా ఇళ్లు మంజూరు చేశాం. పాఠశాలల ఆధునికీకరణ కోసం రూ.54.58 కోట్లు ఖర్చు పెట్టాం. ఆర్‌బీకేలు, వెల్‌నెస్ కేంద్రాలు, సచివాలయాలు నిర్మించాం. జల్‌జీవన్ మిషన్ ద్వారా రూ.300 కోట్లతో ఇంటింటికీ కుళాయిలు వేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి సేవలు అందుబాటులోకి వచ్చాయి. కొత్తగా వైద్య కళాశాల మంజూరైంది. మిగిలిన పనులన్నీ మళ్లీ అధికారంలోకి వచ్చిన వెంటనే త్వరితగతిన పూర్తి చేస్తాం.



పార్వతీపురం

ప్రతిపక్షాలవి అవగాహన లేని మాటలు

మునుపెన్నడూ లేని అభివృద్ధిని నియోజకవర్గంలో చేసిచూపించాం. ఇది చూసి ఓర్వలేక ఓటమి భయంతో ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయి. ఈ నియోజకవర్గం నాయకులు కొంత మంది అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు. వారికి ప్రజలే ఓటు ద్వారా తగిన గుణపాఠం చెబుతారు. వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే. నియోజకవర్గంలో ప్రచారానికి వెళ్లినప్పుడు మాకు ఎక్కడికక్కడ బ్రహ్మరథం పడుతున్నారు. జగన్‌వైపే తామంతా ఉన్నట్లు చెబుతున్నారు. మరోసారి నియోజకవర్గ ప్రజల ఆదరాభిమానాలు నాకే దక్కుతాయన్న నమ్మకం ఉంది. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం తథ్యం.

పేరు ఆమెది.. పెత్తనం వారిది..!

కోతి గెంతడం..యజమాని వసూలు చేయడం అన్న సామెత చందాన తయారైంది టీడీపీ కురుపాం అసెంబ్లీ నియోజకవర్గం మహిళా అభ్యర్థి పరిస్థితి. ఆమెకు బొట్టు పెట్టి ఎన్నికల బరిలో దింపినా వెనుక నుంచి పెత్తనం, ప్రచారం నడిపిస్తున్నదంతా ఆ పార్టీలోని పెద్దలే. ఈ పరిస్థితికి కారణం ఆమెకు కనీస రాజకీయ అనుభవం లేకపోవడమే. నియోజకవర్గం టీడీపీ టికెట్ ఆశించిన వారెవరికీ దక్కకపోవడంతో పోనీలే ఆమెను అడ్డుపెట్టుకుని అయినా పెత్తనం చెలాయించవచ్చన్న ఆలోచనకు వచ్చి తెరవెనుక ఖర్చు చేస్తూ ఎన్నికలు జరగకముందు నుంచే ఆధిపత్యం సాగిస్తున్నారు.

- గిరిజన అభ్యర్థిని నిలబెడుతున్నామంటూ టీడీపీ నయవంచన
- ఖర్చు, హడావిడి పెద్దలదే
- కురుపాం నియోజకవర్గంలో ఎన్నికల సిత్రం



సాక్షి, పార్వతీపురం మన్యం:

మూడు దశాబ్దాలుగా కురుపాం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ జెండా ఎగిరింది లేదు. ఆ పార్టీ నేతలను నియోజకవర్గం ప్రజలు విశ్వసించే పరిస్థితి కానరాదు. పార్టీలో ఎప్పుడూ అంతర్గత కుమ్ములాటలు, ఆధిపత్య ధోరణి, అధికారం చేజిక్కించుకోవాలనే ఆరాటం వెరసి ఎవరికి వారు విశ్వప్రయత్నాలు చేయడం తప్ప అడవి బిడ్డలను పట్టించుకున్న పాపానపోలేదు. ఇదే సందర్భంలో నియోజకవర్గంలో అడుగడుగునా వైఎస్సార్‌సీపీకి ఆదరణ రోజురోజుకూ పెరుగుతోంది. తమకు మేలు చేసిన జగనన్న ప్రభుత్వమంటే ఇక్కడి గిరిజనుల్లో నమ్మకం గూడు కట్టుకుంది. గడిచిన రెండు ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పాముల పుష్పశ్రీవాణి నియోజకవర్గంలో ఘన విజయం సాధించారు. ప్రస్తుతం హ్యాట్రిక్ దిశగా దూసుకుపోతున్నారు. ఆమె విజయాన్ని అడ్డుకునేందుకు నాడు కత్తులు దూసుకున్న వారంతా ఇప్పుడు చేతులు కలిపారు. గిరిజన మహిళ అనే సానుభూతిని తెరపైకి తెచ్చి..నామ్ కే వాస్తేగా ఒక అభ్యర్థిని నిలబెట్టి, కొందరు 'పెద్దలే' వెనుక నుంచి కథంతా నడిపిస్తున్నారు. ఇందులో వైరిచర్ల, శత్రుచర్ల వర్గాలు ఒకటైతే..మరో బలమైన సామాజిక వర్గం నేతలు మరికొందరు ఉండడం గమనార్హం.

రిమోట్ వారి చేతిలోనే..

కురుపాం నియోజకవర్గంలో మూడు దశాబ్దాలుగా తెలుగుదేశం పార్టీ జెండా ఎగరలేదు. గిరిజన ప్రజలు ఎప్పుడూ ఆ పార్టీని తిరస్కరిస్తూనే ఉన్నారు. ఈ దఫా కూడా టీడీపీ నుంచి టికెట్ కోసం చాలా మంది ఆశావహులు పోటీ పడ్డారు. ఆశావహుల్లో వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ ఒకరు. మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు ఆశీస్సులతో అంటూ తోయక జగదీశ్వరిని టీడీపీ తరఫున నిలబెట్టారు. ఆమెకు ఎంపీటీసీగా పనిచేసిన అనుభవం మినహా కనీసం మండలస్థాయి నాయకురాలిగానూ పని చేయలేదని, అటువంటి వ్యక్తికి టికెట్ ఎలా ఇస్తారని పెద్ద పంచాయితీయే నడిచింది. మరో వర్గంలోని డొంకాడ రామకృష్ణ, దత్తి లక్ష్మణరావు వంటివారు టికెట్ ఆశించి భంగపడ్డారు. గుమ్మలక్ష్మీపురానికి చెందిన బిడ్డిక పద్మావతి పేరు కూడా తెరపైకి వచ్చింది. ఇలా సుమారు నాలుగైదు గ్రూపులు టికెట్ ఆశించాయి. నియోజకవర్గ ఇన్‌చార్జిగా తోయక జగదీశ్వరిని నియమించిన తర్వాత ఆమెనైనా తమ అదుపాజ్ఞల్లో ఉంచుకుని, పెత్తనం చెలాయిద్దామన్న ఉద్దేశంతో కొంతమంది బాగా ఖర్చు పెట్టి హడావిడి చేశారు. ఇప్పుడు అభ్యర్థిగా జగదీశ్వరి ఉన్నప్పటికీ..వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ మొత్తం చూసుకుంటున్నారు. దీనివల్ల ఆమెకంటూ స్వతంత్రత గానీ, ప్రత్యేకంగా నిర్ణయాలు తీసుకునే పరిస్థితి గానీ కనిపించడం లేదు. ఒకవైపు గిరిజన బిడ్డను ఆదరించాలని కోరుతూనే..మరోవైపు పెత్తనమంతా వీరేష్ చంద్రదేవ్, శత్రుచర్ల విజయరామరాజు వంటి పెద్దల వద్దే ఉంచుకోవడం ఇప్పుడు గిరిజన ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది.

ఎమ్మెల్యే అభ్యర్థిపైనే దౌర్జన్యం

టీడీపీ నాయకుల దౌర్జన్యాలకు ఇక్కడ కొదవ లేదు. గత ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే పుష్పశ్రీవాణిపై జియ్యమ్మవలస మండలానికి చెందిన డొంకాడ రామకృష్ణ వర్గీయులు దాడికి పాల్పడ్డారు. చినబుడ్డిడి పంచాయతీలోని పోలింగ్ కేంద్రంలో రిగ్గింగ్ జరుగుతోందన్న సమాచారంతో అక్కడికి వెళ్లిన ఎమ్మెల్యే పుష్పశ్రీవాణిని గదిలో నిర్బంధించి తమ అనుచరులతో భయభ్రాంతులకు గురి చేశారు. ఆ ఘటనను నేటికీ నియోజకవర్గ ప్రజలు మరిచిపోలేదు.

నియోజకవర్గానికి టీడీపీ చేసింది శూన్యం

రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న సమయంలోనూ నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రిగా చంద్రబాబు చేసింది శూన్యం. తోటపల్లి ప్రాజెక్టు తన వల్లేనంటూ గొప్పలు చెప్పుకునే చంద్రబాబు..వాస్తవానికి 2003లో తాను పదవి దిగిపోయే నెల ముందు శంకుస్థాపన చేసి వదిలేశారు. ఆ తర్వాత 2004లో అధికారంలో వచ్చిన దివంగత మహానేత వైఎస్సార్ దాదాపు రూ.800 కోట్లు వెచ్చించి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. దివంగత ముఖ్యమంత్రి రోశయ్య పదవీ కాలంలో మరికొంత నిధులను వెచ్చించారు. ఆ పనులన్నీ పూర్తి చేసి అప్పగిస్తే.. 2014లో ఆగస్టులో చంద్రబాబు హయాంలో దీన్ని జాతికి అంకితం చేశారు. దీన్ని తన గొప్పగా చంద్రబాబు చెప్పుకుంటున్నారు. మళ్లీ తోటపల్లి కాలువల ఆధునికీకరణకు రూ.193కోట్లు కేటాయించింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే. గిరిజన ప్రాంతాల్లో రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల కల్పన గడిచిన 59 నెలల కాలంలోనే జరిగిందన్న విషయాన్ని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు.

క్లుప్తంగా

ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేయాలి

● జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నిషాంత్‌కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: సాధారణ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి, అరకు పార్లమెంట్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి నిషాంత్ కుమార్ అన్నారు. ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. ఎన్నికల ఏర్పాట్లపై పార్వతీపురం మన్యం జిల్లా, అల్లూరి సీతారామరాజు జిల్లాల సహాయ రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో గురువారం ఆయన సమీక్షించారు. 13వ తేదీన జరిగే పోలింగ్‌కు సామగ్రి పంపిణీ, రవాణా, రూట్లు తదితర అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. ఎక్కడా ఎటువంటి లోపాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. హింసాత్మక సంఘటనలకు తావులేకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. రాజకీయ పార్టీలు ఎన్నికల కమిషన్ నిబంధనలు తు.చ తప్పక పాటించే విధంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద వైద్య శిబిరం నిర్వహించాలని, అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఐవి ఫ్లూయిడ్స్ తదితర మందులు ఉంచాలని సూచించారు. వైద్య శిబిరం వద్ద ఒక ఏఎన్ఎం, ఆశ కార్యకర్త విధుల్లో ఉండాలని పేర్కొన్నారు. పోలింగ్ పూర్తి చేసుకుని తిరిగి వచ్చి సామగ్రి అప్పగించే సమయంలో నిర్దేశిత ఫారాలు, సామగ్రిని ఖచ్చితంగా తనిఖీ చేసి తీసుకోవాలని, స్ట్రాంగ్ రూంలలో ఈవీఎంలు భద్రపరచడంలో జాగ్రత్తలు వహించాలని స్పష్టం చేశారు. ప్రశాంత ఎన్నికలకు అన్ని పార్టీలు సహకరించాలని కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్, అరకు పార్లమెంట్ నియోజకవర్గ సహాయ రిటర్నింగ్ అధికారి ఎస్ఎస్ శోభిక, జిల్లా రెవెన్యూ అధికారి జి కేశవ నాయుడు, కంట్రోల్ రూం ఇన్‌చార్జ్, ఎస్‌డీసీ ఆర్.వి సూర్యనారాయణ, ఏడు శాసన సభ నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

పదే పదే అదే మాట..!

● మళ్లీమళ్లీ పాత హామీలే ఇచ్చిన చంద్రబాబు


కురుపాంలో ప్రజాగళంసభలో మాట్లాడుతున్న టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు

కురుపాం: ఎన్నికల ప్రచారంలో భాగంగా కురుపాం నియోజకవర్గ కేంద్రంలో ప్రజాగళం సభకు గురువారం వచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబు గడిచిన ఎన్నికల్లో ఇచ్చిన హామీలే మళ్లీ ఇవ్వడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చంద్రబాబు కొమరాడ మండలంలోని పూర్ణపాడు-లాభేసు వంతెన నిర్మాణం కోసం హామీ ఇచ్చి అరకొరగా నిధులు మంజూరు చేయడంతో అది సగంలోనే నిర్మాణం ఆగిపోయిన విషయం విదితమే. మళ్లీ తాజాగా ఇప్పుడు ఎన్నికల ప్రచారంలో భాగంగా కురుపాంలో నిర్వహించిన ప్రజాగళం సభలో పూర్ణపాడు-లాభేసు వంతెన నిర్మాణం పూర్తి చేస్తామని, గుమ్మిడిగెడ్డ పై మినీరిజర్వాయర్ నిర్మాణం చేపడతామని, గుమ్మలక్ష్మీపురంలో జీడిపరిశ్రమ ఏర్పాటు చేస్తామని, తోటపల్లి పాత ప్రధాన కాలువకు రూ.45 కోట్లతో ఆధునికీకరణ పనులు చేసి ఏడువేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే జగనన్న భూ హక్కు పథకం కాగితాల్ని, ల్యాండ్ సీలింగ్ యాక్ట్ కాగితాలను బహిరంగ సభలో చంద్రబాబు దహనం చేశారు. గతంలో కూడా ఇవే హామీలిచ్చి విస్మరించడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలాగే ప్రతిసారీ ఎన్నికలప్రచారానికి వచ్చనప్పుడు పూర్ణపాడు-లాభే సు వంతెన నిర్మాణానికి ఒక అస్త్రంలా వినియోగంచుకుంటున్నారని సభకు హాజరైన గిరిజన ప్రజలు బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేశారు.

నిరీక్షించి వెనుదిరిగిన జనం

ప్రజాగళం సభకు చంద్రబాబు వస్తుండడంతో టీడీపీ శ్రేణులు జనసమీకరణ చేసినా ఉదయం 11 గంటలకు రావాల్సిన చంద్రబాబు మధ్యాహ్నం 1.30 వరకు రాకపోవడంతో మండుటెండలో నిరీక్షించి విసిగివేసారిన ప్రజలు వెనుదిరిగారు. వారిని ఆపేందుకు టీడీపీ నాయకులు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది.

సూపర్ సాలూరు


తుదిదశకు చేరుకున్న కాకులతోట వంతెన



సాలూరు:

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో సాలూరు మున్సిపాలిటీలో ముమ్మరంగా చేపట్టిన అభివృద్ధి పనులతో పట్టణంలో సమస్యలన్నీ దూరం కావడంతో సుందరంగా దర్శనమిస్తోంది. పట్టణ ప్రజలు అవస్థలకు దూరమై సంతోషంగా జీవిస్తున్నారు. పట్టణంలోని వార్డుల్లో సీసీరోడ్లు, డ్రైనేజీలు, మినీ వాటర్‌ట్యాంక్‌ల ఏర్పాటు, సామాజిక మరుగుదొడ్లు తదితర అభివృద్ధి పనులకు **సుమారు రూ.25 కోట్ల నిధులు ప్రభుత్వం మంజూరుచేసింది. గడపగడపకు మనప్రభుత్వం ,14,15 ఆర్థిక సంఘం నిధులతో పట్టణంలోని అభివృద్ధి పనులన్నీ జరిగాయి.**

పేదల సొంతింటి కల సాకారం


పూర్తయిన టిడ్కో ఇళ్లు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాలూరు పట్టణం, మండలంలో వేలాదిమంది పేదలకు సొంతింటి కల సాకారం చేసింది. భూమిని కొనుగోలు చేసి అర్హులైన పేదలకు పట్టాలు అందించి, గృహాలు మంజూరుచేయడంతో పాటు మౌలికవసతులు కల్పించింది. పట్టణంలో రూ.82.85 కోట్లతో టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసింది. ఇందులో గత టీడీపీ ప్రభుత్వం రూ.12.57 కోట్లతో పునాదులు అంతకన్నా తక్కువ దశలో నిర్మాణం చేసి వదిలేయగా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.70.28 కోట్లు ఖర్చు పెట్టి ఇళ్లతో పాటు మౌలిక వసతులు పూర్తిచేసింది. తాగునీటికి 6.28 కోట్లు, రోడ్లకు రూ.1.52 కోట్లు, డ్రైనేజీల కోసం రూ.1.7 కోట్లు, విద్యుత్ సౌకర్యానికి రూ.3.17 కోట్లు, రూ.3.34 కోట్లతో మురుగునీటి శుద్ధి ప్లాంట్ తదితర సౌకర్యాలు కల్పించింది. మౌలిక వసతులతో కూడిన ఇళ్లను పూర్తి చేసి 1056 మంది లబ్ధిదారులకు అందించింది.

పూర్తయిన బైపాస్‌రోడ్డు


పూర్తయిన బైపాస్ రోడ్డు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పట్టణంలో బైపాస్‌రోడ్డు నిర్మాణం పూర్తయింది. దీనివల్ల పట్టణ ప్రజలకు వాయు, శబ్ద తదితర కాలుష్యాల నుంచి ఉపశమనం కలిగింది. చాలావరకు ట్రాఫిక్ సమస్య తొలగింది. అలాగే పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం పాచిపెంట మండల కేంద్రంలో పెద్దగెడ్డ జలాశయం నుంచి పైపులైన్ల ద్వారా నీటిని తెచ్చి, పట్టణంలోని ప్రతి ఇంటికి తాగునీరు అందించనున్నారు. సుమారు రూ.69 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టుకు, శంకుస్థాపన చేయగా, పనులు ప్రారంభమయ్యాయి. ఇంకా పట్టణంలోని కాకులతోట వద్ద వంతెన నిర్మాణం తుది ,దశకు చేరుకుంది. డ్వాక్రా మహిళలతో పట్టణంలో మహిళామార్ట్ ఏర్పాటు చేశారు. నాడునేడు ద్వారా పాఠశాలల ఆధునికీకరణ, వైఎస్సార్ అగ్రిల్యాబ్ నిర్మాణం, వైఎస్సార్ అర్బన్‌హెల్త్ క్లినిక్, రూరల్ పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణం తదితర అనేక అభివృద్ధి పనులు పట్టణంలో జరిగాయి. సుమారు 300 మందికి ఇళ్లస్థలాలు, ఇళ్లు నెలిపర్తి, గుమడాం, జీగిరాం ప్రాంతాల వద్ద ప్రభుత్వం అందజేసింది.

వడివడిగా వందపడకల ఆస్పత్రి నిర్మాణం


తుదిదశకు చేరుకున్న వందపడకల ఆస్పత్రి

పట్టణంలో వందపడకల ఆస్పత్రి పనులు జోరుగా సాగుతూ తుదిదశకు చేరుకున్నాయి. వందపడకల ఆస్పత్రి నిర్మాణం, అభివృద్ధి, ఆధునికీకరణకు నాబార్డ్ నిధులు సుమారు సుమారు రూ.17 కోట్లు మంజూరయ్యాయి. ఈ ఏడాదిలోనే ఆస్పత్రి ప్రారంభోత్సవం జరిగే అవకాశం ఉంది.

కొబ్బరికాయ కొట్టి వదిలేసిన టీడీపీ

కాగా ఈ వందపడకల ఆస్పత్రికి సంబంధించి గత టీడీపీ ప్రభుత్వంలో 2019 ఎన్నికల ముందు హడావుడిగా శంకుస్థాపన చేశారు. తరువాత పనులకు ఇటుక కూడా పడలేదు. ఎన్నికల వేళ ప్రజలను మభ్యపెట్టేందుకు టీడీపీ ఈ విధంగా నాడు శంకుస్థాపన చేసి చేతులు దులుపుకుందన్న విమర్శలు వచ్చాయి. ఆ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ వందపడకల ఆస్పత్రి నిర్మాణానికి నిధులు, అనుమతులు, స్థల సేకరణకు ఉన్న అడ్డంకులు తొలగించింది.

వైఎస్సార్‌సీపీలో 150 టీడీపీ కుటుంబాల చేరిక


వైఎస్సార్‌సీపీలో చేరిన డెన్సరాయి, కాగురూడు ప్రజలతో పీడిక రాజన్నదొర


సీతంపేట: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కళావతితో నాగుడ గ్రామస్తులు

● సాదరంగా ఆహ్వానించిన రాజన్నదొర

సాలూరు: రాజన్నదొర వెంటే మేమంతా అంటూ గిరిశిఖర గ్రామాల ప్రజలు కదం తొక్కారు. వైఎస్‌ఎంపీపీ రెడ్డి సురేష్ ఆధ్వర్యంలో మండలంలోని సంపంగిపాడు పంచాయతీ కాగురూడు, డెన్సరాయి పంచాయతీ, నార్లవలస పంచాయతీలోని తాడిలోవ గ్రామానికి చెందిన సుమారు 150 కుటుంబాల వారు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో గురువారం చేరారు. వారికి వైఎస్సార్‌సీపీ సాలూరు అసెంబ్లీ అభ్యర్థి పీడిక రాజన్నదొర పట్టణంలోని తన గృహంలో పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ అందరు సమష్టిగా పనిచేసి వైఎస్సార్‌సీపీకి భారీ మెజార్టీ తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు కోళ్లపల్లి త్రినాథ, రామ్మూర్తి, గమ్మెల సుబ్బారావు, అనూష, వెలగ పండయ్య, సూపురు పండు, వెలగ వీరయ్య, చోడిపల్లి మంగులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన యువత

పాలకొండ: పట్టణ పరిధిలోని యువత రోజురోజుకు జనసేన పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. ఈ మేరకు గురువారం స్థానిక కౌన్సిలర్లు దుప్పాడ పాపినాయుడు, వెలమల మన్మథరావుల ఆధ్వర్యంలో కాపువీధికి చెందిన 20 మంది యువత వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి వైఎస్సార్‌సీపీ పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. జనసేన పార్టీలో తగిన గుర్తింపు లేని కారణంగా ఆ పార్టీని వీడుతున్నామని ఈ సందర్భంగా పార్టీలో చేరిన యువత తెలిపారు.

మేమంతా వైఎస్సార్‌సీపీలోనే ఉన్నాం

సీతంపేట: మేమంతా వైఎస్సార్‌సీపీలోనే ఉన్నామని సీతంపేట మండలంలోని నాగూడగ్రామానికి చెందిన పలువురు యువకులు స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం వారు వైఎస్సార్‌సీపీ పాలకొండ నియోజకవర్గం అభ్యర్థి విశ్వాసరాయి కళావతిని కలిసి ఈ విషయం తెలియజేశారు. తామంతా జనసేన పార్టీకి వెళ్లిపోయామని తప్పుడు ప్రచారం కావాలని కొంతమంది చేస్తున్నారని అటువంటిది


పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న వైఎస్సార్‌సీపీ పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థి కళావతి


వైఎస్సార్‌సిపిలో చేరిన తాడిలోవ ప్రజలతో పీడిక రాజన్నదొర


బలిజిపేట: వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి కండువాలు వేసిన ఎమ్మెల్యే అభ్యర్థి అలజంగి జోగారావు, ఇతర నాయకులు

ఏమీ లేదని సవర బోగేషు, ఎస్.భాస్కరరావు, ఎస్.జగ్గారావు, ప్రసాదరావు, కిరణ్ తదితరులు తెలిపారు. క్షేత్రస్థాయిలో విస్తృతంగా వైఎస్సార్‌సీపీకి ప్రచారం చేసి ఫ్యాన్ గుర్తుకు ఓటేయించి అత్యధిక మెజార్టీతో కళావతిని గెలిపించుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, పెదరామ సర్పంచ్ తిరుపతిరావు, పార్టీ నాయకులు నిమ్మక కాంతారావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

భామినిలో 10 గిరిజన కుటుంబాలు

భామిని: మండలంలోని బూర్జగూడకు చెందిన టీడీపీ ఆదివాసీ నాయకుడు బిడ్డిక వెంకన్న ఆధ్వర్యంలో 10 గిరిజన కుటుంబాలు గురువారం వైఎస్సాఆర్‌సీపీలో చేరాయి. పార్టీలో చేరిన నాయకులకు వైఎస్సార్‌సీపీ పాలకొండ అభ్యర్థి విశ్వాసరాయి కళావతి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఆదివాసీ మహిళా నాయకులు బిడ్డికఅప్పన్న, బిడ్డిక జామన్న, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు రొక్కం రమేష్, కాగితాపల్లి కృష్ణారావు, పోతల మజ్జి కార్యక్రమలో పాల్గొన్నారు.

బలిజిపేటలో 50మంది చేరిక

బలిజిపేట: మండలంలోని అజ్జాడ గ్రామానికి చెందిన 50మంది టీడీపీ చెందిన వారు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీలో గురువారం చేరారు. వైఎస్సార్‌సీపీ పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థి అలజంగి జోగారావు వారందరికీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. గ్రామానికి చెందిన అక్కేన పార్వతమ్మ, కుమార్, ఎం.సత్యం నాయుడులతో సహా 50మంది పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. అనంతరం పార్టీలో చేరినవారు మాట్లాడుతూ వైఎస్ జగన్మోహన్ రెడ్డి అందించిన సంక్షేమ పథకాలకు, స్థానిక ఎమ్మెల్యే జోగారావు చేపట్టిన అభివృద్ధికి ఆకర్షితులమై పార్టీలో చేరుతున్నామని చెప్పారు. ఈ ప్రాంతవాసి అయిన ఎమ్మెల్యే జోగారావును అత్యధిక మెజారిటీతో గెలిపించుకునేందుకే కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, ఏపీ క్రియేటివిటి కల్చరల్ కమిషన్ చైర్‌పర్సన్ వంగపండు ఉష, రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు శ్రీవాణి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, అక్కేన రామూర్తినాయుడు, శ్రీనివాసరావు, జగన్నాథం, కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు వెంకటరమణ, ఉప సర్పంచ్ లక్ష్మణరావు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అక్షరాలే ఆరాధ్య దైవాలు

● అక్షరబ్రహ్మ దేవాలయాల్లో ప్రతిష్ఠ
● సవర భాష లిపినే దైవంగా పూజించే ఆదివాసీల సంప్రదాయం
● 1936లో అక్షయ తృతీయ నాడు సవర లిపి రూపాల ఆవిష్కరణ


నూకాలమ్మ మెట్టపై విశాలమైన అక్షరబ్రహ్మ ఆశ్రమం


మతార్పన్ ప్రచారంలో ఆదివాసీల అక్షరదీక్ష పూజలు

భామిని: మాతృభాషకు గుర్తింపునిచ్చే అక్షర రూపాలనే దేవతలుగా ఆరాధించే అరుదైన ఆచారం ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ఆదివాసీ గిరిజనుల్లో ప్రత్యేకంగా కనిపిస్తుంది. సరిహద్దులో గల ఆదివాసీలు మాట్లాడే సవర భాషకు అక్షర రూపం వచ్చి తమకు గుర్తింపు తెచ్చిన సవర లిపిలోని అక్షర రూపాలను విగ్రహాలుగా ప్రతిష్ఠించి ఆరాధిస్తున్న అరుదైన సనాతన ఆచారం వారిది. ఆదివాసీల మాతృభాష సవరభాష లిపిని విగ్రహాలుగా పెట్టి అక్షర బ్రహ్మ ఆలయాలు కట్టి ఆదివాసీ లోకానికి ఉద్యమంగా సవరలిపిని విస్తృత పరుస్తూ, లిపి ప్రాముఖ్యతను మాతార్పన్ ఉద్యమంగా ప్రచారం సాగిస్తున్నారు.

పుష్కరకాలం కఠోర తపస్సుతో సాధన..

ఆదివాసీల భాషకు లిపి లేకపోవడంతో సమాజంలో గుర్తింపు లేదని, సవరలు మాట్లాడే భాషకు గుర్తింపు తెచ్చేందుకు సవర పండిత్ మంగై గుమాంగో మనోవేదనకు గురై దేశాంతరాల్లో పర్యటించారు. దైవజ్ఞులతో చర్చించి, ఆదివాసీల గుర్తింపు కోసం పుష్కర కాలం కఠోర తపస్సు చేసి 1936లో అక్షర తృతీయ నాడు సవర లిపిని దైవాజ్ఞతో ఆవిష్కరించారని ఆదివాసీల నమ్మకం. సవర పండిత్ మంగయ్య గుమాంగో తపస్సులో దైవాజ్ఞతో సాధించిన సవర లిపిని 24 అక్షరాలు, ఒక పొల్లు అక్షరంగా యోగనిద్రలో ఆయన గుర్తించారు. వాటిని విగ్రహాలుగా మలిచి ఆదివాసీలు అక్షరబ్రహ్మ ఆలయాల్లో ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు. 1952లో ఒడిశాలో మంగయ్య తపస్సు చేసిన మిర్చిగూడలో మొదటి అక్షరబ్రహ్మ ఆలయం నిర్మాణం జరిగింది.

పార్వతీపురం మన్యం జిల్లాలోని భామిని మండలంలో మనుమకొండ, పాలవలస, సీతంపేట మండలంలో నొగడ, ముత్యాలు, శంభాంలోను, గుమ్మలక్ష్మీపురం మండలంలోని కన్నాయిగూడ, పెద్దగూడలలో అక్షరబ్రహ్మ అలయాలు వెలిశాయి. సతివాడ మెట్టపై సీతంపేట ఐటీడీఏ ఆర్థిక సహాయంతో భారీ అక్షరబ్రహ్మ ఆశ్రమం నిర్మించారు.

సవర భాషకు గుర్తింపు కోసం



ఆదివాసీల మాతృభాష సవర భాష గుర్తింపు కోసం మతార్పనమ్ పేరున విస్తృత ప్రచారం చేస్తున్నాం. గూడగూడల్లో అక్షర బ్రహ్మ ఉద్యమాన్ని విస్తృతం చేస్తున్నాం. అక్షర బ్రహ్మ ఆలయాలు, మందిరాలతో పాటు అక్షర బ్రహ్మ దీక్షలు,వ్రతాలను అమలు చేస్తున్నాం.సతివాడ వద్ద పవిత్రకొండ పేరున ఆశ్రమంలో బోధకులకు శిక్షణ ఇస్తున్నాం.బోధకులతో సవర భాషను నేర్పుతున్నాం.దురాచారాలను దూరం చేస్తున్నాం. సవర కరువయ్య, మతార్పనమ్ జిల్లా కోఆర్డినేటర్, సతివాడ పవిత్ర ఆశ్రమం

రైలు ఢీకొని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

బొండపల్లి: మండలంలోని గరుడుబిల్లి - బొండపల్లి గ్రామాల మధ్య గల రైలుపట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గురువారం గుర్తించి రైల్వే పోలీసులకు తెలియజేశారు. వెంటనే వారు సంఘటనా స్థలానికి చేరుకుని రైలు ఢీ కొనడంతో మృతి చెంది ఉంటాడని భావించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేంద్ర సర్వజన ఆస్పత్రికి తరలించారు. మృతుడి వయసు సుమారు 55 సంవత్సరాలు ఉంటాయని పోలీసులు తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు 94906 17089, 90000 52651 నంబర్లను సంప్రదించాలని కోరారు.


కొమరాడ: పూడేసులో ఎన్నికల ప్రచారంలో చేస్తున్న వైఎస్సార్‌సీపీ కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి పాముల పుష్పశ్రీవాణి


సీతంపేట: టౌన్‌లో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థి కళావతి, పార్టీ నాయకులు


సీతానగరం: గుచ్చిమిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థి అలజంగి జోగారావుకు విజయతిలకం దిద్దుతున్న మహిళలు


సాలూరు: చిన హరిజనపేట ప్రచారంలో వైఎస్సార్‌సీపీ సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి పీడిక రాజన్నదొరకు హారతిస్తున్న మహిళలు

ఓటరు దేవుళ్ల ఆశీర్వాదం కోసం

మరో మూడు రోజుల్లో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ జరగనున్న నేపథ్యంలో అసెంబ్లీ బరిలో పోటీ పడుతున్న అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఎండైనా..వానైనా ఖాతరు చేయకుండా తమ ముందున్న గెలుపు లక్ష్యాన్ని సాధించేందుకు ప్రజలతో మమేకమవుతూ ఓటర్లను అభ్యర్థిస్తున్నారు.

క్లుప్తంగా

బొబ్బిలి ప్రజలకు వైద్య భరోసా



బొబ్బిలి ప్రజలకు నాటి వైఎస్సార్, నేటి జగన్‌మోహన్‌రెడ్డి వైద్యభరోసా కల్పించారు. పట్టణంలో మాతా శిశు ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా రూ.42 లక్షల ఖర్చుతో 2007లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర రెడ్డి మతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని (సీమాంక్ సెంటర్) నిర్మించి ప్రారంభించారు. ఆయన తనయుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి నాడు–నేడు కార్యక్రమంలో రూ.3.24 కోట్ల వ్యయంతో సామాజిక ఆస్పత్రి భవనాలను నిర్మించారు. ఆధునిక సదుపాయాలతో సుందరంగా తీర్చిదిద్దారు. నాటి వైఎస్సార్, నేటి జగన్‌మోహన్‌రెడ్డి కృషితోనే ప్రజలకు ఆరోగ్య భరోసా కలిగిందంటూ ఆస్పత్రికి వచ్చేవారంతా చెబుతారు. తండ్రీ కొడుకుల హయాంలో పక్కపక్కనే ఏర్పాటైన భవనాలు చూపరులను ఆకర్షిస్తున్నాయి.

– బొబ్బిలి

సాలూరులో టీడీపీకి షాక్

200 మంది వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: పట్టణంలో టీడీపీకి భారీ షాక్ తగిలింది. పట్టణంలోని 28,29 వార్డుల కౌన్సిలర్లు, నాయకులు గొర్లె వెంకటరమణ, బలభద్రుని శ్రీనివాస రావు, జలుమూరి శ్రీనివాసరావు, పురిపండ ప్రసాద్‌ల ఆధ్వర్యంలో యాతవీధికి చెందిన టి.రమణ, గౌరు, జి.పాపారావు, గణేష్, కె.ఎర్రయ్య, ఎం.రమణ, సీహెచ్ రాము తదితర సుమారు 70 కుటుంబాలకు 200 మంది టీడీపీని వీడి గురువారం వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వైఎస్సార్‌సీపీ సాలూరు అసెంబ్లీ అభ్యర్థి పీడిక రాజన్నదొర వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. అందరూ సమష్టిగా పనిచేసి వైఎస్సార్‌సీపీకి అఖండ మెజారిటీ అందజేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిదులు, నాయకులు పాల్గొన్నారు.

భంజ్‌దేవ్‌ను నమ్మని సంధ్యారాణి

- అనుమానపు చూపులు
- తన అనుచరులతో ఆయన కదలికలపై నిఘా
- దీనిపై మండిపడుతున్న భంజ్‌దేవ్ వర్గీయులు
- అవమానకరమంటూ ఆరోపణలు
- నాటి నుంచి నేటి వరకు సంధ్యారాణి నైజం అదే నంటూ విమర్శలు



సాలూరు: ఇద్దరూ టీడీపీ సీనియర్ నాయకులే. టికెట్ ఆశించిన వారే. అందులో సంధ్యారాణి టికెట్ దక్కించుకున్నారు. అప్పటి నుంచి మరో ఆశావహుడు, పార్టీ సీనియర్ నాయకుడు భంజ్‌దేవ్‌పై అనుమానం పెంచుకున్నారు. ఆయనకు ఇవ్వాల్సిన గౌరవం ఇవ్వకుండా అనుమానపు చూపులు చూస్తుండడం ప్రస్తుతం సాలూరు నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ భంజ్‌దేవ్, ఆయన అనుచరులపై ప్రత్యేక నిఘా వేయడం, వారి కదలికలను పసిగడుతున్న సంధ్యారాణి తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వెన్నుపోటు రాజకీయాలు నెరపడం సంధ్యారాణికి అలవాటని, ఆమెకు అందరూ ఆ విధంగానే కనిపిస్తున్నారంటూ టీడీపీలోని ఓ వర్గం మండిపడుతోంది. నమ్మని వ్యక్తుల కోసం పనిచేయడమంటే బురదలో పోసిన పన్నీరే అవుతుందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

ఆది నుంచి ఆమె తీరు అంతే...

సంధ్యారాణి ఎమ్మెల్సీగా పనిచేసిన సమయంలోనూ ఈ ప్రాంతానికి ఏ మేలు చేయలేదు. ఏ నాయకుడు, కార్యకర్తకు అండగా నిలబడలేదు. ఆపదవేళ ఆదుకున్నదీ లేదని కొందరు టీడీపీ నాయకులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఇప్పుడు భంజ్‌దేవ్, ఆయన వర్గీయులను తొక్కి పెట్టడమే ప్రధాన అజెండాగా పనిచేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. గతంలో భంజ్‌దేవ్ వర్గీయుడుగా పేరొందిన పాచిపెంట మండలాధ్యక్షుడు పిన్నింటి ప్రసాద్‌బాబును పార్టీ మండలాధ్య పదవి నుంచి తప్పించి ముఖీ సూర్యనారాయణకు ఇవ్వడం, దీనితో తీవ్రమనస్తాపానికి గురైన భంజ్‌దేవ్ పార్టీ అదిష్టానం వద్ద పట్టుబట్టి మరలా ప్రసాద్‌కు పార్టీ అధ్యక్ష పదవి కట్టబెట్టించారు. దీనిని మనసులో పెట్టుకున్న ఆమె.. అన్ని మండలాల్లోను పార్టీని రెండు వర్గాలుగా విభజించారు. పార్టీ కోసం కష్టపడే భంజ్‌దేవ్ వర్గీయులను పక్కనపెడుతూ తన వర్గానికి ప్రాధాన్యం ఇవ్వడం ప్రారంభించారు. ఈ కోవలోనే మక్కువ మండల టీడీపీ నాయకుడు పెంట తిరుపతిరావుతో నేటికి విభేదాలు కొనసాగుతున్నాయన్నది టీడీపీ శ్రేణులే చెబుతున్నాయి. ఇలాంటి అభ్యర్థికి పొరపాటున ఓటు వేసినా, మద్దతు తెలిపినా మునిగిపోతామని ఆ పార్టీలోనే కొందరు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. గతంలో భంజ్‌దేవ్ ఓటమికి ఆమే కారణమన్న వాదనా వినిపిస్తోంది.

చివరికి భంజ్‌దేవ్‌ను, ఆయన అనుచరులను పార్టీకి శాశ్వతంగా దూరం చేయడమే అంతిమ లక్ష్యంగా సంధ్యారాణి పనిచేస్తోందన్న చర్చ సాగుతోంది. గెలవకముందే ఆమె వ్యవహార తీరు ఇలా ఉంటే... పొరపాటున గెలిస్తే భంజ్‌దేవ్ పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఆమె చేస్తున్న పనులన్నీ దీనికి మరింత బలం కూర్చుతున్నాయన్నది పార్టీ వర్గీయుల మాట.

విజయవంతంగా ముగిసిన పోస్టల్ బ్యాలెట్

- వినియోగించుకున్న ఉద్యోగులు 8053మంది

పార్వతీపురంటౌన్: సార్వత్రిక ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా గురువారం ప్రశాంతంగా ముగిసింది. ఎన్నికల విధులు నిర్వహించనున్న ఉద్యోగులు పోస్టల్‌బ్యాలెట్ ఓటింగ్‌ను వినియోగించుకున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ఓటు కలిగి ఉండి జిల్లాలో ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులకు వారి సొంత నియోజకవర్గ కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటుకు ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇతర జిల్లాల్లో ఓటు హక్కు కలిగి జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవడానికి పార్వతీపురంలోని శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ఐదురోజుల్లో ఓటింగ్ ఇలా

జిల్లా వ్యాప్తంగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా 8053 మంది ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. అత్యధికంగా కురుపాం నియోజకవర్గంలో 2498 మంది, అత్యల్పంగా సాలూరు నియోజకవర్గంలో 1486 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పార్వతీపురం నియోజకవర్గంలో 2194 మంది, పాలకొండ నియోజకవర్గంలో 1875 మంది, ఇతర జిల్లాలో విధులు నిర్వహించిన 1638 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారు.

హోమ్ ఓటింగ్‌లో 579 ఓట్లు నమోదు

వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులకు హోమ్ ఓటింగ్ విధానాన్ని కొత్తగా ప్రవేశపెట్టారు. జిల్లాలో 85 ఏళ్ల దాటిన వారు 3,900మంది ఉండగా 270మంది, 12,247మంది దివ్యాంగులు ఉండగా 383మంది హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 579 మంది ఓటేశారు.

హోమ్ ఓటింగ్ ఇలా...

నియోజకవర్గం	పోలైన ఓట్లు
సాలూరు	163
పార్వతీపురం	270
కురుపాం	33
పాలకొండ	113

నియోజకవర్గం	తొలిరోజు	రెండవరోజు	మూడవరోజు	నాల్గవ రోజు	ఐదవ రోజు
పార్వతీపురం	1098	499	335	171	49
సాలూరు	546	561	211	89	79
కురుపాం	914	888	486	160	50
పాలకొండ	726	584	348	138	79
ఇతర జిల్లా ఓటింగ్	773	439	290	104	32

ప్రజాశీస్సులు

ప్రచార పర్వం

ఎన్నికల ప్రచారానికి ఇంటింటికీ వెళ్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థులకు ప్రజాశీస్సులు లభిస్తున్నాయి. మహిళలందరూ హారతిచ్చి, విజయతిలకం దిద్దుతున్నారు. 59 నెలల్లోనే మా కుటుంబాలకు ఎంతో మేలు చేశారని.. జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకునేందుకు ఫ్యాన్ గుర్తుకు ఓటేస్తామని మాట ఇస్తున్నారు. అభ్యర్థులతో కలిసి ప్రచారంలో పాల్గొంటున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



చీపురుపల్లి మేజర్ పంచాయతీ కొత్త అగ్రహారంలో విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహిళలు హారతిచ్చి ఆశీర్వదించారు. గెలుపు భరోసా కల్పించారు.



తెర్లాం మండలం డి.గదబవలసలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగికి అక్కడి మహిళలు హారతిచ్చి విజయతిలకం దిద్దారు. ఫ్యాన్ గుర్తుకే ఓటేస్తామని చెప్పారు.



గజపతినగరం మండలం ఎం.గుమడాం గ్రామంలో గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఎన్నికల ప్రచారం చేశారు. ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు.



కొత్తవలస మండలం మంగళపాలెంకు ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యేకు మద్దతుగా ముందు నడిచారు.



డెంకాడ మండలం అమకాం గ్రామస్తులు నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుకు గజమాలతో స్వాగతం పలికారు. మీ వెంటనే మేమంతా అంటూ సుస్పష్టం చేశారు. గెలుపు భరోసా ఇచ్చారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798.